సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 753 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
42.1°/22.3°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం, వడగాల్పుల తీవ్రత ఎక్కువైంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

అభ్యర్థుల ఖర్చులు నిశితంగా పరిశీలించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు వినాయక్



అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకులు వినాయక్

హిందూపురం: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలన్నీ నిశితంగా పరిశీలించాలని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు వినాయక్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన హిందూపురం అసెంబ్లీ నియోజక నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమ నిబంధన పరిశీలన కమిటీ, వ్యయ పరిశీలన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు వ్యయాన్ని పక్కాగా లెక్కించడంతోపాటు, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాలను నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించిన రికార్డులు భద్రపర్చాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

చింతపండు క్వింటా రూ.15 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చింతపండు క్వింటా ధర గరిష్టంగా రూ.15 వేలు పలికింది. మార్కెట్‌కు గురువారం 2,107 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.11 వేల ప్రకారం ధర పలికిందన్నారు. అలాగే ప్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.8,500, కనిష్టంగా రూ.4 వేలు, సగటున రూ.5 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

మండుతున్న భానుడు



పుట్టపర్తి టౌన్: భానుడు భగభగ మండిపోతున్నాడు. వడగాల్పుల తీవ్రత కూడా పెరగడంతో జనం అల్లాడిపోతున్నారు. గురువారం చెన్నేకొత్తపల్లిలో 42.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లో 39 నుంచి 42 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఇక గాండ్లపెంటలో 22.3 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా, మిగతా ప్రాంతాల్లోనూ 23 నుంచి 28 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. రొద్దం, నల్లమాడ, కదిరి, అమరాపురం, అమడగూరు మండలాల్లో గాలివేగం 8 నుంచి 12 కిలోమీటర్లు ఉండగా, మిగతా ప్రాంతాల్లో గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

తొలిరోజు ఏడు నామినేషన్లు



వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంత తరఫున నామినేషన్ వేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి



ధర్మవరం అసెంబ్లీ స్థానానికి ఒక సెట్టు నామినేషన్ సమర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



కలెక్టరేట్‌కు వందమీటర్ల ముందే ఉద్యోగులను తనిఖీ చేసి లోపలకు పంపుతున్న పోలీసులు

- ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్
- 11 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- ఆర్‌ఓ కార్యాలయాల వద్ద పోలీస్ బందోబస్తు
- పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి ఆరు నామినేషన్లు
- ధర్మవరంలో ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేసిన కేతిరెడ్డి

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. గురువారం ఉదయం జిల్లాలోని ఒక పార్లమెంట్, ఆరు అసెంబ్లీ స్థానాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ వెంటనే పుట్టపర్తి, హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర అసెంబ్లీ స్థానాలతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల దాఖలు ప్రారంభమైంది. తొలిరోజు హిందూపురం పార్లమెంట్ స్థానానికి ఒకటి, అసెంబ్లీ స్థానాలకు ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయి. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ...నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25 వరకు ఉంటుందన్నారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ ఆఖరన్నారు. మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు చెక్‌లిస్ట్ ప్రకారం నామినేషన్‌తో డాక్యుమెంట్లు జతపరచాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నామినేషన్లు తిరస్కరిస్తామన్నారు. అందువల్ల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని సూచించారు.

7 నామినేషన్లు దాఖలు

- హిందూపురం పార్లమెంట్ నియోజక స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోలదరాశి శాంత తరఫున హిందూపురానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబుకు నామినేషన్ పత్రాలు అందజేశారు.
- వైఎస్సార్‌సీపీ ధర్మవరం నియోజకవర్గ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌ఓ వెంకటశివరామిరెడ్డికి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.
- పుట్టపర్తి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, పల్లె వెంకట కృష్ణ కిషోర్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయానికి అనుచరులతో కలిసి వెళ్లి ఆర్‌ఓ భాగ్యరేఖకు నామినేషన్లు అందజేశారు.
- హిందూపురం అసెంబ్లీ స్థానానికి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి శ్రీరాములు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ అభిషేక్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.
- రాప్తాడు నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా ప్రొఫెసర్ రాజేష్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

ఆర్‌ఓ కార్యాలయాల వద్ద 144 సెక్షన్..

జిల్లాలోని వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేశారు. హిందూపురం పార్లమెంట్ స్థానానికి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్నందున కలెక్టరేట్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇతరులను ఎవరినీ అనుమతించలేదు. కలెక్టరేట్ అధికారులను కూడా గుర్తింపు కార్డులు చూపిన తర్వాతే లోనికి అనుమతించారు. అలాగే ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రధాన రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీలను నిషేధించారు. అభ్యర్థుల వాహనాలను కూడా ఆర్‌ఓ కార్యాలయానికి వందమీటర్ల ముందే నిలిపివేశారు. అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే నామినేషన్ దాఖలుకు అనుమతించారు. ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ విష్ణు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్ని స్థానాల్లో గెలుస్తాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్



విలేకరులతో మాట్లాడుతున్న నవీన్ నిశ్చల్

చిలమత్తూరు: ''ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు వర్తింపజేశారు. అన్ని వర్గాలకు న్యాయం చేశారు. అందుకే మేం ఈ ఎన్నికల్లో ధైర్యంగా ఓటు అడుగుతున్నాం.. ప్రజాభిమానంతో జిల్లాలోని అన్ని స్థానాల్లో గెలిచి తీరుతాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ అన్నారు. గురువారం ఆయన పార్టీ నేత వేణురెడ్డితో కలిసి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము మంచి చేశాం కాబట్టి దాన్ని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నామని, టీడీపీ హయాంలో ఏం చేయలేకపోయారు కాబట్టే ఆ పార్టీ నేతలు వారు చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు చెప్పుకోలేక..తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. హిందూపురంలో బీసీ మహిళ దీపికకు జగనన్న అవకాశం ఇచ్చారని, తప్పకుండా భారీ మెజార్టీతో పురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామన్నారు.

24న టీఎన్ దీపిక నామినేషన్..

వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 24న తమ పార్టీ హిందూపురం అభ్యర్థి టీఎన్ దీపిక నామినేషన్ వేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, అన్సర్ అహ్మద్, రాఘవేంద్రరెడ్డి, సుందరరాజు, గోవిందరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, బాబే నాయక్, అంజన్‌రెడ్డి, శంకరప్ప, నయీముల్లా పాల్గొన్నారు.

'తమ్ముళ్ల' నిరుత్సాహం

- నామినేషన్ల తొలిరోజే వెలవెల
- పల్లె సింధూర నామినేషన్‌కు జనం కరువు
- ఫలించని మాజీ మంత్రి పరిటాల సునీత ప్లాన్
- రాప్తాడు నుంచి ప్రొఫెసర్ రాజేష్ నామినేషన్

సాక్షి, పుట్టపర్తి

ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టంలోనే టీడీపీ కథ తేలిపోయింది. మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీతకు తొలిరోజే షాక్ తగిలింది. రాప్తాడు బరిలో ఉంటానని ముందుగానే ప్రకటించిన ప్రొఫెసర్ రాజేష్ స్వతంత్ర అభ్యర్థిగా తొలిరోజే నామినేషన్ దాఖలు చేశారు. ఆయన రాప్తాడు టీడీపీ టికెట్ ఆశించిన సంగతి తెలిసిందే. ఇక మరో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూరారెడ్డి గురువారం నామినేషన్ పత్రాలు సమర్పించగా, జనం కరువయ్యారు.

జనంలేక..నానా హంగామా..

భారీ జనసమీకరణతో ఆర్భాటంగా నామినేషన్ వేయాలని భావించిన 'పల్లె' కుటుంబ సభ్యులకు కార్యకర్తలు ఝలక్ ఇచ్చారు. భోజన వసతి ఏర్పాటు చేసి.. మద్యం, డబ్బు ఎరగా వేసి ఆహ్వానించినా జనం పెద్దగా స్పందించలేదు. ఓడిపోయే వారి వెంట ఎందుకు నడవాలని కార్యకర్తలూ రాలేదు. దీన్ని కవర్ చేసుకునేందుకు తెలుగు 'తమ్ముళ్లు' మద్యం మత్తులో పుట్టపర్తి రోడ్ల వెంట ఓవరాక్షన్ చేస్తూ.. సామాన్యులను ఇబ్బందులకు గురి చేశారు. బైక్‌ల సైలెన్సర్లు తీసేసి పెద్దపెద్ద శబ్దాలతో హడావిడి చేశారు. అనంతరం కొందరు తెలుగు తమ్ముళ్లు మద్యం మత్తులో పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయం ముందుకు వెళ్లి హంగామా చేశారు. ప్రచారం రథం ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. వెంటనే అర్బన్ సీఐ కొండారెడ్డి అక్కడకు చేరుకుని వారిని చెదరగొట్టారు.

'పరిటాల'కు రెబల్స్ బెడద..

రాప్తాడు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పరిటాల సునీతను అధిష్టానం ఖరారు చేసింది. అయితే ధర్మవరం టికెట్ ఆశించి.. పొత్తులో భాగంగా బీజేపీకి ఇవ్వడంతో ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ రాప్తాడు నుంచి పోటీ చేస్తారని ప్రచారం చేస్తున్నారు. దీంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. రోజుకొకరిని అభ్యర్థిగా ప్రకటిస్తే.. పార్టీలో ఎక్కడా నాయకులే లేరా? పరిటాల కుటుంబానికే టికెట్ ఇవ్వాలా? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రాప్తాడు టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ ప్రొఫెసర్ రాజేష్.. తొలిరోజే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

కార్యకర్తల నుంచి స్పందన కరువు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా.. టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం రాలేదు. ఆయా నియోజకవర్గాల అభ్యర్థులపై ఉన్న వ్యతిరేకత కారణంగా కార్యకర్తలెవరూ పెద్దగా స్పందించడం లేదు. చాలా చోట్ల అభ్యర్థులను మార్చాలని అధిష్టానానికి విన్నవించినా.. చంద్రబాబు – నారా లోకేశ్ వినకుండా.. వారినే బరిలో దింపడాన్ని చాలామంది సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో టీడీపీలో కొందరు నాయకులు కొనసాగుతున్నా.. తమ అనుచరులందరినీ అధికార పార్టీ వైపు పంపిస్తున్నారు. హిందూపురం పార్లమెంటు వ్యాప్తంగా రోజుకు సగటున వంద పైగా కుటుంబాలు వైఎస్సార్‌సీపీ గూటికి చేరుకోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.



పుట్టపర్తిలో హంగామా చేస్తున్న టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

కొత్తచెరువు: 'పల్లె' నామినేషన్ అనంతరం గురువారం సాయంత్రం మండలంలోని కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన కమ్మ, బోయ సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జయప్ప నాయుడు, బోయ రామాంజి పుట్టపర్తిలో జరిగిన 'పల్లె' సింధూర నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీలో తాము గొప్ప అంటే తాము గొప్ప అంటూ ఘర్షణ పడ్డారు. అనంతరం జయప్ప నాయుడు అక్కడినుంచి వెళ్లిపోయాడు. దీంతో రామాంజి పుట్టపర్తి, భైరాపురంలోని తన బంధువర్గాన్ని ఓ ఆటోలో తీసుకుని కమ్మవారిపల్లి వెళ్తున్నాడు. అయితే బండ్లపల్లి క్రాస్ సమీపంలో జయప్ప ఎదురుపడటంతో అతనిపై దాడికి దిగారు. వెంటనే అక్కడకు చేరుకున్న జయప్ప నాయుడు వర్గీయులు సైతం రామాంజి బంధువులపై దాడులు చేశారు. ఒకానొక దశలో ఆటోకు సైతం నిప్పు పెట్టాలని చూడగా... కొత్తచెరువుకు చెందిన ఓ టీడీపీనేత ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఈ ఘటనలో భైరాపురం గ్రామానికి చెందిన యువకులు గాయపడినట్లు తెలుస్తోంది.

మాత్రల పంపిణీలో నవశకం



- సర్కారీ ఆస్పత్రుల్లో ఫుల్లుగా మందుబిళ్లలు
- ఐదేళ్లుగా మందుల్లేవన్న మాట వినిపించని పరిస్థితి
- ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏటా సగటున రూ.30 కోట్ల విలువైన మాత్రలు
- డ్రగ్స్‌తో పాటు సర్జికల్ ఉపకరణాలూ సరఫరా
- సర్వజనాసుపత్రికి 600 రకాల పైగా మందులు, సర్జికల్ వస్తువులు
- పీహెచ్‌సీలలో 176 మందులకు తక్కువ కాకుండా అందుబాటులో
- గతంలో ఎన్నడూ లేని విధంగా బలోపేతమైన ప్రభుత్వాస్పత్రులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో సర్కారీ వైద్య వ్యవస్థ కనీవినీ ఎరుగని రీతిలో బలోపేతమైంది. గతంలో తమిళనాడు, కేరళ ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలను ఉదాహరణకుగా చెప్పుకునే వారు.. కానీ వైఎస్సార్ సీపీ సర్కారు వచ్చాక ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను ఉదహరిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిస్థితిని చూస్తే గతానికి నేటికీ పోలికే లేదనేది స్పష్టంగా అర్థమవుతుంది. కాన్పులు మొదలు ఎలాంటి చికిత్సకైనా మందులు లేవన్న మాటే వినిపించలేదు. 2019కి ముందు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లుంటే మందులుండవు.. మందులుంటే డాక్టర్లుండవు అనేలా దుస్థితి ఉండేది. కనీసం కట్టుకు దూదీ, సూదీ కూడా ఉండేవి కావు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది. పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. చిన్న ఆస్పత్రికి వెళ్లినా వైద్యులు అందుబాటులో ఉంటున్నారు.

ఏటా రూ.30 కోట్లు మందులకే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చూపించుకుంటే, మందులు బయట తీసుకోవాలని డాక్టర్లు చిట్టీలు రాసి పంపేవారు. కానీ నేడు ఏటా ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.30 కోట్ల విలువైన మందులు సరఫరా చేస్తున్నారు. ఒక్క సర్వజనాసుపత్రికే ఏటా రూ.3 కోట్ల విలువ కలిగిన మందులు పైగా వినియోగమవుతున్నట్టు అంచనా. అత్యవసర జాబితాలోని మందులు కూడా అందుబాటులో ఉంటున్నాయి. అదనపు జాబితాలోని మందులు అవసరాన్ని బట్టి కొనుగోలు చేస్తున్నారు. 600 రకాల పైగా మందులు సర్వజనాసుపత్రిలోనూ, జిల్లా ఆస్పత్రి (హిందూపురం)లోనూ అందుబాటులో ఉంటున్నాయి. ఖరీదైన గుండె, క్యాన్సర్ జబ్బులకూ మందులు ఉండటం విశేషం.

పీహెచ్‌సీలకూ వెల్లువ..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోనూ వందల రకాల మందులు ఉంటున్నాయి. గతంలో 60 రకాలు మందులుంటే గొప్ప. కానీ, నేడు 176 రకాల మందులు అందిస్తున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనూ 176 రకాల మందులు దొరుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 90 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. పీహెచ్‌సీ స్థాయి నుంచే పాముకాటు, కుక్కకాటు నియంత్రణా మందులు అర్ధరాత్రి వెళ్లినా వేయడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో జిల్లాలో మందుల పంపిణీ ప్రక్రియ స్వరూపమే మారిపోయినట్టు వైద్యులే చెబుతున్నారు.

ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న మందుల వివరాలు..

అత్యవసర మందులు	560
అదనపు మందులు	152
జాబితాలో ఉన్న మొత్తం మందులు	712
సర్వజనాసుపత్రిలో ఉన్నవి	600 పైగా
జిల్లా ఆస్పత్రి (హిందూపురం)	600 పైగా
ఏరియా ఆస్పత్రుల్లో	405
కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో	370
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో	176

అన్ని రకాల మందులిస్తున్నారు



గతంతో పోలిస్తే ప్రభుత్వాస్పత్రులు ఎంతో మారాయి. గతంలో సరైన వైద్యం అందేది కాదు. మందులు దొరికేవి కావు. కానీ ఇప్పుడు అలా లేదు. నాకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో నాలుగు రోజులుగా హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నా. ఇక్కడ వైద్య సేవలు చాలా బాగున్నాయి. మందులు అందిస్తున్నారు. ప్రస్తుతం నా ఆరోగ్యం సైతం కుదుటపడింది. ప్రైవేటు ఆస్పత్రి చికిత్స చేయించుకుని ఉంటే రూ.వేలల్లో ఖర్చయ్యేది. ప్రభుత్వాస్పత్రిలోనే నాకు ఉచితంగా మెరుగైన వైద్యం అందింది.

– నారాయణస్వామి, వీవర్స్‌కాలనీ, హిందూపురం



కదిరి నాల్గో వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మక్బూల్‌కు ఘన స్వాగతం పలుకుతున్న స్థానికులు



బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై పూల వర్షం

అపూర్వ ఆదరణ

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఏ గ్రామానికి ప్రచారానికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరిస్తామని చెబుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం బాలలు



ఎంపికైన బాలలను అభినందిస్తున్న ధర్మాంబ బాస్కెట్‌బాల్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: ఈ నెల 19 నుంచి 22 వరకు కృష్ణాజిల్లా నూజివీడులో జరిగే రాష్ట్ర స్థాయి 9వ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ధర్మవరం బాల బాలికలు ఎంపికయ్యారని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. బాలికల విభాగంలో నీఖ్య, సల్మా, కిరణ్మయి, బాలుర విభాగంలో తరుణ్ ఎంపికయ్యారని చెప్పారు. క్రీడాకారులను ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ తదితరులు అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

హిందూపురం అర్బన్: తూమకుంట గ్రామానికి చెందిన నారాయణప్ప(42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈయన రెండు రోజులుగా కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్లల్లా వెదుకుతున్నారు. ఈ క్రమంలో గురువారం కర్ణాటక సరిహద్దున ఉన్న పెట్రోల్ బంక్ ఎదురుగా ఓ కాలువలో నారాయణప్ప మృతదేహం లభ్యమైంది. గౌరీబిదనూరు పోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నారాయణప్పకు భార్య గంగమ్మ, కుమారులు రోహిత్‌కుమార్, అఖిల్ ఉన్నారు.

అభివృద్ధికి రహదారి





ఓడీ చెరువు వద్ద సిద్ధమైన 716జీ జాతీయ రహదారి, పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో వేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు, బుక్కపట్నం మండలం రాసింపల్లి తండా నుంచి యర్లంపల్లికి వెళ్లే పీఆర్ రోడ్డు

శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. గడిచిన ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సంక్షేమ పథకాల అమలుతో పాటే అభివృద్ధి పనులపైనా దృష్టి సారించింది. రహదారుల నిర్మాణాలతో జిల్లా రూపురేఖలు పూర్తిగా మారాయి. అన్ని ప్రాంతాలకూ రాకపోకలు, రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి.

శరవేగంగా రోడ్ల నిర్మాణం

- గ్రామీణ నుంచి జాతీయ రహదారుల వరకు అభివృద్ధి
- అన్ని ప్రాంతాల రాకపోకలకూ మార్గం సుగమం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రహదారుల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. జాతీయరహదారులతో పాటు రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ

రోడ్డు	కిలోమీటర్లు	ఖర్చు (రూ.కోట్లలో)
ఎన్‌హెచ్ 342	80	1745
ఎన్‌హెచ్ 716జీ	90.58	1648.70
గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్	75	850
పంచాయతీరాజ్ రోడ్లు	233	350
ఆర్‌అండ్‌బీ రోడ్లు	804	366
పీఎంజీఎస్‌వై	131.18	52.55
కదిరి బైపాస్	12.58	220.66
ముదిగుబ్బ బైపాస్	7.7	116.81
బత్తలపల్లి-ముదిగుబ్బ	33	401.72
మడకశిర-శిర	42.37	207.79
హిందూపురం-పరిగి	20.04	98.16
మొత్తం	1529.45	6057.39

రాజ్, పీఎంజీఎస్‌వై, జాతీయ ఉపాధి హామీ పథకం, ఎంపీపీ, జెడ్పీ నిధుల కింద రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో చాలా వరకూ పూర్తయ్యాయి. వీటి కోసం ప్రభుత్వం ఏకంగా రూ.6,057 కోట్లు వెచ్చిస్తోంది. జిల్లాలో మొత్తం 1,529 కిలోమీటర్ల మేర రోడ్లు ఏర్పాటు చేసింది. వందేళ్ల నుంచి తారు రోడ్డుకు నోచుకోని గ్రామాలకు సైతం రోడ్డు నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల పురోగతి ఇలా...

జిల్లా పరిధిలో 250 కిలోమీటర్లకు పైబడి జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు. వచ్చే రెండేళ్లలో పూర్తి చేయాలనే సంకల్పంతో పనులు చేస్తున్నారు. ఈ రోడ్లతో బెంగళూరు, హైదరాబాద్, కడప, కర్నూలు, చిత్తూరు ప్రాంతాలకు కనెక్టవిటీ పెరుగుతుంది. 80 కిలోమీటర్లు 342వ జాతీయరహదారి నిర్మించేందుకు రూ.1,745 కోట్లు ఖర్చు చేస్తున్నారు. 90.58 కిలోమీటర్లు 716జీ జాతీయ రహదారి నిర్మాణం కోసం రూ.1648.70 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇక జిల్లా మీదుగా 75 కిలోమీటర్లు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూ సేకరణ పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం రూ.850 కోట్లు ఖర్చు చేయనున్నారు.

- రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 32 మండలాల పరిధిలో 804 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలకు రూ.366 కోట్లు వెచ్చిస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 233 కిలోమీటర్ల రోడ్లు వేసేందుకు రూ.350 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- పీఎంజీఎస్‌వై కింద 131.18 కిలోమీటర్లకు పైగా రోడ్ల నిర్మాణాలకు రూ.52.55 కోట్లు ఖర్చు పెట్టారు. 12.58 కిలోమీటర్ల కదిరి బైపాస్ రోడ్డుకు రూ.220.66 కోట్లు, 7.7 కిలోమీటర్ల ముదిగుబ్బ బైపాస్‌కు రూ.116.81 కోట్లు ఖర్చు చేస్తోంది. 20.04 కిలోమీటర్ల హిందూపురం-పరిగి రోడ్డుకు రూ.98.16 కోట్లు, 42.37 కిలోమీటర్ల మడకశిర-శిరరోడ్డుకు రూ.207.79 కోట్లు, 33 కిలోమీటర్ల బత్తలపల్లి-ముదిగుబ్బ రోడ్డుకు రూ.401.72 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

పరిశ్రమల రాకకు మార్గం సుగమం..

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. జాతీయ రహదారులతో పాటు పలు పరిశ్రమలు ఒకదానితో ఒకటి పోటీ పడి వస్తున్నాయి. మెరుగైన రవాణా సౌకర్యం, ప్రభుత్వ సహకారం, నీటి వసతి, అనుకూలమైన వాతావరణం ఉండడంతో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో 3,257 ఎకరాల భూమి సేకరించి అభివృద్ధి చేయంతో పలు పరిశ్రమలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 1,138 యూనిట్ల కోసం భూమిని సిద్ధం చేశారు. 249 యూనిట్లు నెలకొల్పడానికి ప్లాట్లు కేటాయించారు.

ఇన్ని రోడ్లు ఎన్నడూ చూడలేదు



నా జీవితంలో ఇన్ని రోడ్ల ఏర్పాటు ఎన్నడూ చూడలేదు. ప్రయాణం సులభమై పరిశ్రమలు వస్తున్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి కదిరిలో విపరీతమైన జన సంచారంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం కదిరి బైపాస్ రాకతో వాహనాల రద్దీ పూర్తిగా తగ్గి ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

– అంజనేయులు, సైదాపురం, కదిరి

పుట్టపర్తిలో తిరుగులేని అభివృద్ధి



నేషనల్ హైవే 342 గ్రామాల గుండా వెళ్తుండడంతో జిల్లా కేంద్రం పుట్టపర్తికి వెళ్లడం చాలా సులభంగా ఉంది. ఇక కప్పలబండలో పరిశ్రమల కోసం 101 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి కేటాయించగా.. ఇప్పటికే 50 ఎకరాల్లో పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. దీంతో స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయి. చాలా సంతోషంగా ఉంది.

– మాబూసాహెబ్, నిడిమామిడి, పుట్టపర్తి

హిందూపురానికి కనెక్టివిటీ పెరిగింది



ప్రముఖ వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న హిందూపురానికి అన్ని వైపుల నుంచి రోడ్డు కనెక్టివిటీ పెరిగింది. పుట్టపర్తి, బెంగళూరు, కొడికొండ చెక్‌పోస్టుకు, పరిగి మండల కేంద్రానికి, మడకశిరతో పాటు జాతీయ రహదారి 716జీతో కదిరి, చిత్తూరు, తిరుపతికి సులభంగా చేరుకునే వీలుంది. ఈ రహదారులతో వ్యాపారాలు మరింత అభివృద్ధి సాధిస్తాయి.

– బాబిరెడ్డి, హిందూపురం

అప్రమత్తంగా ఉండాలి



నిషాడిజైన్స్ ఫ్యాక్టరీలో ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అగ్ని విపత్తుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్ని మాపక అధికారి నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం గుంతపల్లి వద్దున్న నిషా డిజైన్స్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు అవగాహన కలిగించారు. డీఎఫ్ఓ నాగరాజునాయక్ మాట్లాడుతూ మీరు పనిచేస్తున్న ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అవగాహణ కలిగి ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పు ఎలా కాపాడుకోవాలో డెమో ద్వారా వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది విజయ కుమార్, నరసింహులు, రామాంజనేయులు, దేవలానాయక్, వెంకటరెడ్డి రామాంజనేయులు, దామోదర్, తేజేశ్వర్‌రెడ్డి, ఎస్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

సజావుగా ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రీ పీహెచ్‌డీ గురువారం ప్రారంభమయ్యాయి. ఎస్కేయూ క్యాంపస్‌లోని పరీక్ష కేంద్రాలను వీసీ డాక్టర్ కె.హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల్లోని వసతులను ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం 'పురం' అధ్యక్షుడిగా సల్మాన్‌ఖాన్

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ యువజన విభాగం హిందూపురం నియోజకవర్గ అధ్యక్షునిగా సల్మాన్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ నియామక పత్రం అందజేశారు. తన మీద నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు సల్మాన్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

జగనన్నకు అండగా నిలవండి

- మంత్రి ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



పెద్దగువ్వలపల్లిలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, ఆయన పరిపాలనకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ఎంత తేడా ఉందో గమనించాలని మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కంబాలపల్లి, తురకలాపట్నం, ఆర్ కుర్లపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వల్ల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు పెట్టి ఆ పార్టీ నాయకులకే పథకాలు అందించారని విమర్శించారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకు అందరూ మళ్లీ అండగా నిలవాలన్నారు. ఈనెల 25న తన నామినేషన్ కార్యక్రమం ఉంటుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు మారుతీరెడ్డి, నరసింహులు, రాజగోపాల్‌రెడ్డి, అక్కులప్పయాదవ్, లక్ష్మీనారాయణ రెడ్డి, వజీర్‌బాషా, ఎస్.నారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, రాజారెడ్డి, వినయ్‌రెడ్డి, ఉజ్జినప్ప, సి.నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



ప్రయాణికులతో మాట్లాడుతున్న సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అనిల్‌కుమార్ కండేవాల్

హిందూపురం అర్బన్: రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రైల్వే సెంట్రల్ బోర్డు మెంబర్ అనిల్ కుమార్ కండేవాల్ పేర్కొన్నారు. గురువారం హిందూపురం రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసి మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లే ట్రాక్, అక్కడికి చేరుకొనేందుకు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, అలాగే రైల్వే ప్లాట్‌ఫాం డిజిటల్ కోచ్ స్టాపింగ్ బోర్డుల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ సదుపాయాలు పరిశీలించారు. స్టేషన్‌లో ఎలెక్ట్రిక్ డిజిటల్ బోర్డు, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. రూ.15 కోట్లతో చేపడుతున్న రైల్వే ప్రధాన ద్వారం వద్ద, ఇతర చోట్ల చేపడుతున్న ఆధునికీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు వందే భారత్ రైళ్లు హిందూపురంలో ఆపాలని, కొన్ని ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఇక్కడ ఆపడం లేదని, వాటిని కూడా ఆపేలా చూడాలని, ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని, బెంగళూరు – హిందూపురం ప్యాసింజర్ రైలు గుంతకల్లు వరకు నడిచేలా చూడాలని, అడిగారు. త్వరలోనే అవి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటామని అనిల్ కుమార్ కండేవాల్ తెలిపారు. స్టేషన్‌లో రాత్రి వేళ లైట్లు వెలిగేలా చూస్తామన్నారు. రైల్వే అధికారుల విశ్రాంతి భవనం ఆవరణలో సెంట్రల్ బోర్డు మెంబర్, డీఆర్ఎంలు మొక్కలు నాటారు. ఆయన వెంట డీఆర్ఎం యోగేష్ మోహన్, సీనియర్ డీసీఎం కృష్ణ చైతన్య, సీనియర్ డీవైఎం కృష్ణారెడ్డి, స్టేషన్ మాస్టర్ రామచంద్ర, ఎస్‌డబ్ల్యూ ఆర్ఎంయూ నాయకుడు కిరణ్, సోమప్ప, ఆనంద్ తదితరులు వారి వెంట ఉన్నారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వజ్రకరూరు: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని వజ్రకరూరు మండలం గూళ్యపాళ్యంలో గురువారం సాయంత్రం సీతారాముల రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం స్థానిక ధర్మప్ప దేవాలయంలో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అధిష్టింపజేశారు. అనంతరం రథానికి పూజలు నిర్వహించి... జై శ్రీరామ్ అంటూ ఆలయం నుంచి గురుదేవా ఆశ్రమం వరకూ లాగారు. అనంతరం యథాస్థానానికి చేర్చారు.

తిమ్మంపల్లిలో సూరీడు వర్ధంతి



సూరీడు ఘాట్ వద్దకు వెళుతున్న ఆలూరి సాంబశివారెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు



సూరీడు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకట్రామిరెడ్డి

యల్లనూరు: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, దివంగత కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం యల్లనూరు మండలం తిమ్మంపల్లిలోని ఆయన ఘాట్ వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. సూరీడు సతీమణి కళావతమ్మ, తాడిపత్రి, ధర్మవరం ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, యువ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే సోదరుడు కృష్ణారెడ్డి, కుటుంబసభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొప్పేపల్లి రామాంజులరెడ్డి, సజ్జలదిన్నె రాజు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి.. ఒకరి మృతి



కృష్ణప్ప మృతదేహం

పావగడ: అడవిపందుల గుంపు తగిలి బైక్ అదుపు తప్పి కిందపడటంతో పావగడ తాలూకా బెల్లిబట్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, గ్రామ పంచాయతీ సభ్యుడు బోయ కృష్ణప్ప(40) మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. బోయ కృష్ణప్ప తన భార్య గుండమ్మతో కలిసి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో బంధువుల ఊరు అచ్చమ్మనహళ్లికి బయల్దేరాడు. శైలాపురం – కోటగుడ్డ మధ్య మద్రేనహళ్లి అటవీ ప్రాంతంలో అడవిపందుల గుంపు రోడ్డుకు అడ్డంగా వచ్చి బైకును తోశాయి. అదుపు తప్పి కిందపడటంతో కృష్ణప్ప తలకు తీవ్రగాయమైంది. గ్రామస్తులు గమనించి వెంటనే ఆయన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. పరిస్థితి విషమించి కృష్ణప్ప మృతి చెందారు. ఇదే ప్రమాదంలో భార్య గుండమ్మ స్వల్ప గాయాలతో బయటపడింది.